

వాయుసేనలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 24(ఆంధ్రజ్యోతి): అగ్నిపథ్ వాయుసేనలో ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.సుధ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 'స్త్రీ, పురుష అభ్యర్థులు 2 జూలై 2005 నుంచి 2 జనవరి 2009 మధ్య జన్మించిన వారు అర్హులు. ఇంటర్ ఎంపీసీ లేదా డిప్లమో (పాలిటెక్నిక్), లేదా ఇంటర్ ఒకేషనల్‌లో 50 శాతం మార్కులు, ఇంగ్లీష్‌లో కనీసం 50శాతం మార్కులు కలిగి ఉండాలి. ఈ నెల 31వ తేదీలోగా సంబంధిత వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల'ని ఆమె సూచించారు.

గోల్డ్ మాల్!





- నరసన్నపేటలో బంగారం మాయలెన్నో
- బిల్లులు లేకుండా విక్రయాలు
- మిల్లీగ్రాముల్లో చిలక్కొట్టుడు
- టెస్టింగ్ కేంద్రాలతో మిలాఖత్
- అనుమతి లేకుండా షాపుల నిర్వహణ

నరసన్నపేట, జూలై 24(ఆంధ్రజ్యోతి): నరసన్నపేటలో కొందరు బంగారం వ్యాపారులు మాయాజాలంతో వినియోగదారులను బురిడీ కొట్టిస్తున్నారు. కొందరు మిల్లీగ్రాముల్లో తుకాల్లో తేడాలకు పాల్పడుతుంటే.. మరికొందరు ఎటువంటి అనుమతి లేకుండా బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) అనుమతి ఉన్నట్లు నకిలీ పత్రాలతో వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ఇంకొందరు ఎటువంటి బిల్లులు ఇవ్వకుండా ఎస్టిమేట్ కాగితాల్లో లెక్కలను అప్పగించి వినియోగదారులకు కుచ్చుటోపీ పెడుతున్నారు.

నరసన్నపేటలో సుమారు 300 బంగారం షాపులు ఉన్నాయి. వీటిలో హోల్‌సేల్ 12 వరకు ఉండగా.. మిగతావన్నీ రిటైల్ షాపులు. వీటిని ఇళ్లు, షాపుల్లో నడిపిస్తున్నారు. బంగారం షాపు నిర్వహించాలంటే బీఐఎస్ అనుమతి తప్పనిసరి. ఆభరణాలకు హాల్‌మార్కు ఉండాలి. అయితే నరసన్నపేటలో సగానికి పైగా షాపులకు ఎటువంటి అనుమతులు లేకపోవడమే కాకుండా కొందరు పాత అనుమతులతో షాపులను నిర్వహిస్తున్నారు. కొందరు వ్యాపారులు డమ్మీ లేబుల్స్‌తో హాల్‌మార్క్ ఉన్నట్లు విక్రయిస్తున్నారు. ఇలా పెద్ద పెద్ద షాపుల్లో కూడా డమ్మీ హాల్‌మార్క్‌తో కిలో ఆభరణాలు విక్రయించిన వైనాన్ని బీఐఎస్ అధికారులు ఈ నెల 17న జీఎస్ఆర్(గుడ్ల నాగరాజు) బంగారం షాపులో గుర్తించారు. ఒక్క జీఎస్ఆర్ మాత్రమే కాదు.. అనేక షాపుల్లో ఇదే తంతు కొనసాగుతోంది. బీఐఎస్ అధికారులు దాడులు చేసే సమయంలో మిగతా బంగారు వర్తకులు షాపులు మూసివేసి పరుగులు తీశారంటే.. ఎన్ని లొసుగులు

- (మిగతా 6వ పేజీలో..)

అంతా ఎస్టిమేట్ రూపంలోనే ...

పట్టణంలో కొందరు వ్యాపారులు బంగారు ఆభరణాలు కొనుగోలు చేసేవారికి ఎటువంటి బిల్లులు ఇవ్వడం లేదు. కొందరైతే నగదు చెల్లిస్తేనే ఆభరణాలు విక్రయిస్తున్నారు. డెబిట్, క్రెడిట్ కార్డులతో చెల్లింపులకు ఒప్పుకోవడం లేదు. పెళ్లిళ్లకు బంగారు ఆభరణాలు ఆర్డర్ (ఔత్తా)యించే సమయంలో ఎటువంటి బిల్లులు ఇవ్వకుండా ఎస్టిమేట్ పత్రాల మీద అడ్వాన్సులు తీసుకుంటున్నారు. ఆభరణాలు విక్రయించే సమయంలో కూడా ఇదే తంతును కొనసాగిస్తున్నారు. సక్రమంగా వ్యాపారాలు సాగిస్తే ప్రభుత్వానికి 4శాతం పన్నులు చెల్లించాల్సి ఉంటుంది. దీనికి ఎగనామం పెట్టేందుకు ఈ విధంగా వ్యవహరిస్తున్నారు.

తూకాల్లో చేతివాటం

కొందరు బంగారు వ్యాపారులు తుకాలతో వినియోగదారులకు కుచ్చుటోపీ పెడుతున్నారు. గ్రాము ధర రూ.10వేలకుపైనే ఉంది. మిల్లీగ్రాము ధర రూ.100 పడుతుంది. కొందరు వ్యాపారులు ఆభరణాలు విక్రయించే సమయంలో మిల్లీగ్రాముల్లో వచ్చిన విలువను లెక్కల్లో చూపకుండా.. గ్రాముల్లో వినియోగదారుల దగ్గర దోచుకుంటున్నారు. నెలవారీ స్కీమ్స్ కట్టే వినియోగదారులకు మిల్లీగ్రాములతో సహా ధరను మదింపు చేస్తారు. అదే వినియోగదారులు వారికి విక్రయిస్తే గ్రాముల్లో ధరను మదింపు చేసి దోచుకుంటున్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, పాల్గొన్న డిప్యూటీ సీఎం పవన్, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్న తదితరులు

ఉమ్మడి జిల్లాలో
బయోగ్యాస్ ప్లాంట్లు

- ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం

శ్రీకాకుళం, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో బయోగ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అమరావతిలో గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన నిర్వహించిన మంత్రి మండలి సమావేశంలో పలు జిల్లాల అభివృద్ధికి సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో రెండు ప్రాంతాల్లో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు చేసిన అభ్యర్థనను మంత్రి మండలి ఆమోదించింది. శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం సంతవురిటిలో 15 టీపీడీ కంప్రెస్డ్ బయోగ్యాస్ రెండు ప్లాంట్లను, వంగర మండలం అరసాడలో 20 టీఈడీ కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు ఇటీవల వీఈఎస్ గ్రూప్ ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుంది. దీనికి మంత్రి మండలి ఆమోదించింది. సుమారు రూ. 200 కోట్లతో రెండు ప్రాంతాల్లో బయోగ్యాస్ ప్లాంట్‌లు కొద్దినెలలో ఏర్పాటు కానున్నాయి. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఇతర మంత్రులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్‌ల్లో ధరల వివరాలు ప్రదర్శించాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ కె.అనిత



అరసవల్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెం టర్లు, ల్యాబ్‌ల్లో అంది స్తున్న సేవలకు సంబంధించిన ధరల వివరాల పట్టికను ప్రజలకు తెలిసేలా ప్రదర్శించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.అనిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఏపీ ప్రైవేటు మెడికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం-2002, 2007, 2009 ప్రకారం ఈ వివరాలను తెలుగు, ఆంగ్ల భాషల్లో ఆయా సెంటర్ల రిసెప్షన్ కౌంటర్ వద్ద చక్కగా కనిపించేలా ప్రదర్శించాలి. ప్రతీ సంవత్సరం జూలై 1న సేవల ధరలలో సవరణలు ఉంటే సరిచేసి, కొత్త జాబితాను ఏర్పాటు చేయాలి. ధరలకు సంబంధించిన ఒక ప్రతిని వారం రోజుల్లో డీఎంహెచ్‌వో కార్యాలయంలో సమర్పించాలి. లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవ'ని డీఎంహెచ్‌వో హెచ్చరించారు.

బె'ధర'గొడుతున్నాయ్

- పెరిగిన కూరగాయల ధరలు
- వాతావరణ పరిస్థితులతో నష్టం
- వినియోగదారులపై భారం



కోటబొమ్మాళి/ నరసన్నపేట, జూలై 24(ఆంధ్రజ్యోతి): నెల రోజుల కిందట సామాన్యులకు అందుబాటులో ఉండే కూరగాయల ధరలు ప్రస్తుతం రెట్టింపయ్యాయి. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు కూరగాయ పంటలకు నష్టం కలిగిస్తున్నాయి. కొన్నిచోట్ల వర్షాభావం, మరికొన్నిచోట్ల వర్షాల కారణంగా కూరగాయ పంటలు దెబ్బతిన్నాయి. దీంతో కూరగాయలకు గిరాకీ పెరుగుతోంది. టమాటా, బెండ, గోరుచిక్కుడు, పొడవుచిక్కుడు, బీర, కాకర, వంకాయలు, సారికంద.. ఇలా (మిగతా 6వ పేజీలో..)

ధరలు ఇలా.. (కిలోల్లో..)

కూరగాయలు	నెల కిందట	ప్రస్తుతం
టమాటా	రూ.20	రూ.70
పచ్చిమిర్చి	రూ.30	రూ.80
వంకాయ	రూ.30	రూ.50
దొండకాయ	రూ.30	రూ.45
బీరకాయ	రూ.25	రూ.50
క్యారెట్	రూ.35	రూ.60
గోరుచిక్కుడు	రూ.30	రూ.45
కాకర	రూ.35	రూ.50

కామ్రేడ్ సుబ్బారావు పాణిగ్రాహి సతీమణి మృతి

- నేడు బొడ్డపాడులో అంత్యక్రియలు



సురేఖ పాణిగ్రాహి(ఫైల్)

పలాస రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): విప్లవ కవి సుబ్బారావు పాణిగ్రాహి సతీమణి సురేఖ పాణిగ్రాహి(83) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. పలాస మండలం బొడ్డపాడులో నివసిస్తున్న ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేవారు. శ్రీకాకుళం సాయుధ గిరిజన పోరాటంలో కామ్రేడ్ సుబ్బారావుకు వెన్నుదన్నుగా నిలిచి.. భర్త సైద్ధాంతిక భావాలను అర్థం చేసుకుంటూ జీవనం సాగించారు. ఆమె మృతదేహాన్ని విప్లవ పార్టీ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. శుక్రవారం బొడ్డపాడులో ఆమె అంత్యక్రియలు నిర్వహించనున్నారు.



చిన్నపిల్లమ్మ (ఫైల్)

మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు జోగారావు తల్లి మృతి

8లో



కంట్రోల్‌రూమ్‌లో ఉన్న అధికారులు..

ఎరువుల సమాచారానికి..
కంట్రోల్ రూమ్

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎరువుల సరఫరా, వినియోగంపై కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ప్రాజెక్టు నియంత్రణ విభాగంలో ఈ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని వ్యవసాయాధికారి కోరాడ త్రినాథస్వామి తెలిపారు. ఎరువుల లభ్యత, ఇతర సమాచారం కోసం రైతులు **91218 63788** నెంబర్‌ను సంప్ర దించాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో సరిపడా ఎరువుల నిల్వలు ఉన్నాయని, కొరత లేదని స్పష్టం చేశారు. అవసరానికి మించి ఎరువులను వినియోగిస్తే.. భూమి సారం తగ్గిపోయి దిగుబడిపై ప్రభావం పడుతుందన్నారు. రైతులు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

భారీ వర్షం.. పొలాలు జలమయం

- మరో మూడు రోజులు తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దు
- అత్యవసర సాయానికి 112, 1070, 18004250101 నెంబర్లు ఏర్పాటు: కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

6లో

బాలబడి.. నూతన ఒరవడి

- అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రత్యేక పాఠ్య పుస్తకాలు

కేజీబీవీ అక్రమాలపై డిప్యూటీ కలెక్టర్ విచారణ

7లో

ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపో విడదీస్తే సహించేదిలేదు

- వామపక్ష నేతల హెచ్చరిక

ఏటా ముంపే

- భీమసముద్రం గెడ్డతో తప్పని ముప్పు
- పేరుకుపోయిన పూడికలు.. అస్తవ్యస్తంగా కాలువలు
- పొలాల్లో నీరు నిలిచి రైతులకు ఇబ్బందులు



రత్తకన్న వద్ద భీమసముద్రం గెడ్డ ఇలా..

ఇచ్ఛాపురం, జూలై 24(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం వచ్చిందంటే చాలు.. ఇచ్ఛాపురం మండలంలోని పదుల సంఖ్యలో గ్రామాల రైతులు ముంపు భయంతో వణికిపోతారు. వర్షాల సమయంలో భీమసముద్రం గెడ్డ పొంగి పొలాల మీద వరద నీరు ప్రవహిస్తుంది. కొన్నేళ్లుగా నిర్వహణ లేక గెడ్డలో పూడిక, చెత్త పేరుకుపోయింది. ఫలితంగా ఏటా వర్షాకాలంలో ముంపు సమస్య ఏర్పడి.. వరి పంటకు నష్టం వాటిల్లుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భీమసముద్రం గెడ్డ.. ఒడిశా రాష్ట్రం కొండల నుంచి ఇచ్ఛాపురం మండలంలోని ముచ్చింద్ర, కేదారిపురం, బెన్నుగానిపేట, బాలకృష్ణాపురం, మునిభద్ర, మండపల్లి, రత్తకన్న గ్రామాల మీదుగా ప్రవహిస్తోంది. ఆపై బాహుదా నదిలో కలిసి సముద్రంలో చేరుతుంది. వర్షాకాలంలో ఒడిశా కొండపై నీరు, పై ప్రాంతాల్లో నీరు కలిసి ఈ గెడ్డలో ప్రవహిస్తుంది. కానీ గెడ్డ నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో నీటి ప్రవాహ గమనం మారుతోంది. పొలాలపై సాగునీరు ప్రవహించి పంటకు నష్టం వాటిల్లుతోంది. ఇచ్ఛాపురం మండలంలోని ఆ ఏడుగ్రామాల్లో దాదాపు 3వేల ఎకరాల ఆయకట్టు ఉంది. గెడ్డలో సాధారణ స్థాయిలో నీటి ప్రవాహం ఉంటే పర్వాలేదు. కానీ వర్షాకాలం, వరదల

(మిగతా 6వ పేజీలో..)



నౌపడలో కొత్త స్టేషన్ భవనం, ప్లాట్‌ఫారం నిర్మాణ పనులు..



సమస్యలు తీరుతాయ్!

- చురుగ్గా నౌపడ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు
- రామ్మోహన్‌నాయుడు చొరవతో నిధులు

టెక్కలి రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): నౌపడ రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. కొన్ని దశాబ్దాల పాటు ఈ రైల్వేస్టేషన్‌కు నిధులు మంజూరు కాకపోవడంతో ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. అమృత్ భారత్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఈ స్టేషన్ అభివృద్ధికి గతేడాది నిధులు మంజూరు చేసింది. వైసీపీ ప్రభుత్వ హయాంలోని ప్రతిపక్ష ఎంపీగా ఉన్నప్పటికీ కింజరాపు రామ్మోహన్ నాయుడు చొరవతో ఈ రైల్వేస్టేషన్‌కు రూ.18కోట్లు మంజూరు అయ్యాయి. కానీ పనులు సక్రమంగా సాగలేదు. ప్రస్తుతం కూటమి అధికారంలోకి రావడం, రామ్మోహన్‌నాయుడు కేంద్ర మంత్రి కావడంతో ఎప్పటికప్పుడు రైల్వే అధికారులతో ఆయన సమీక్షించి పనులు వేగవంతానికి చర్యలు చేపట్టారు. నూతన భవనాలతోపాటు ప్లాట్‌ఫారాన్ని ఆధునికీకరిస్తున్నారు. రెండు ప్లాట్‌ఫారాల వంతెన పనులు చేస్తున్నారు. ప్లాట్‌ఫారంపై రేకుల షెడ్‌లు, స్టీల్‌బెంచీలు ఏర్పాటు చేస్తున్నారు. తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నారు. మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు.

- టెక్కలి, పాతపట్నం, సంతబొమ్మాళి, మెళియాపుట్టి, కోటబొమ్మాళి మండలాల నుంచి అధిక సంఖ్యలో ప్రయాణికులు ఈ రైలేస్టేషన్ నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడ కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడేవారు. లైట్లు కూడా సక్రమంగా వెలగకపోవడంతో రాత్రి వేళ ఇక్కడ రైలు ఎక్కేందుకు భయపడేవారు. పలాస రైల్వేస్టేషన్‌కు వెళ్లి రైళ్లు ఎక్కేవారు. ప్రస్తుతం నౌపడ స్టేషన్ అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతుండడంతో.. త్వరలో తమ కష్టాలు తీరనున్నాయని ఈ ప్రాంతవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బాలబడి.. నూతన ఒరవడి

● అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రత్యేక పాఠ్య పుస్తకాలు
● నవచేతన, ఆధార్ శిల పేరుతో రూపకల్పన


అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలు

హరిపురం, జూలై 24(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేయడంతో పాటు పూర్వ ప్రాథమిక విద్యలోనే ప్రయివేటు ప్లేస్కూళ్లకు దీటుగా విద్యాబోధన సాగించడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. దీనికోసం ప్రత్యేక చర్యలు ప్రారంభించింది. మూడేళ్ల వయసు దాటిన చిన్నారులకు మెరుగైన విద్యాబోధనకు వీలుగా పాఠ్య పుస్తకాలను జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసింది. ఇంగ్లిష్, లెక్కలు, తెలుగుతో పాటు స్పోకెన్ ఇంగ్లిష్‌ను సులభంగా నేర్చుకునే రీతిలో పుస్తకాలను రూపొందించారు. ఆటపాటలతో పాటు విద్యాబోధన చేయడానికి వీలుగా కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. కొత్తగా వచ్చిన పుస్తకాలను చదివేందుకు కేంద్రాలలో చిన్నారులు ఆసక్తి చూపుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులు మానసికంగా, శారీరకంగా ఎదిగేలా నవచేతన, ఆధార్ శిల పేర్లతో పాఠ్య పుస్తకాలను రూపొందించారు. వీటిని కేంద్రాలను సరఫరా చేశారు. వీటిలోని అంశాలను కార్యకర్తలు అమలు చేయడంతో పాటు తల్లిదండ్రులకు వివరించాల్సి ఉంటుంది.


జిల్లాలో ఇలా..

ఐసీడీఎస్ ప్రాజెక్టులు	16
అంగన్‌వాడీ కేంద్రాలు	3,385
గర్భిణులు	10,228 మంది
బాలింతలు	8,296 మంది
3-4 ఏళ్లలోపు పిల్లలు	23,328
4-6 ఏళ్లలోపు పిల్లలు	16,688

కార్యకర్తలకు 'నవచేతన'

అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు ఈ ఏడాది కొత్తగా నవచేతన, ఆధార్‌శిల పేరిట రెండు పుస్తకాలు అందజేశారు బాల్యారంభ ప్రేరణకు జాతీయ చట్టం-2025 మేరకు పుట్టినప్పటి నుంచి మూడేళ్ల వయసు వరకూ ప్రేరణ కృత్యాలు నేర్పించడం 'నవచేతన' ముఖ్య ఉద్దేశం. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారం వంటి వాటిని వివరిస్తారు. పిండ భద్రత, రక్షణ, ప్రతిస్పందన, వంటివాటిపై కార్యకర్తలు అవగాహన కల్పిస్తారు. పుట్టిన బిడ్డకు తల్లిపాలు తాగించడం, తల్లి ఎలాంటి ఆహార పదార్థాలు తీసుకుంటే పోషకాలు అందుతాయో వివరిస్తారు.





'ఆధార్ శిల'తో ఎలాగంటే..

బాల్య ఆరంభ సంరక్షణ, విద్య నేర్పించడం 'ఆధార్ శిల' పుస్తకాల లక్ష్యం. మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లల పెంపకం, కుటుంబ సభ్యులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచిస్తారు. చిన్నారులకు శారీరక బాష, మేథ, సాంస్కృతిక, సృజనాత్మక, సామూహిక భావోద్వేగాభివృద్ధి వంటివి నేర్పిస్తారు. శారీరక, మానసిక ఆరోగ్యం పెరుగుదల వంటివి వివరిస్తారు.

ప్రైవేటుకు దీటుగా...

జిల్లాలో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాలను తీర్చిదిద్దనున్నాం. ఆటపాటలతో విద్యాబోధన అందిస్తున్నాం. దీనికి సంబంధించి ప్రభుత్వం సరికొత్తగా పుస్తకాలు మంజూరు చేసింది. వీటన్నింటినీ కేంద్రాలకు తరలించాం. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రవేశాల పెంపునకు చర్యలు తీసుకున్నాం. కార్యకర్తలకు మెరుగైన శిక్షణ అందించాం. వీటి అమలులో కార్యకర్తలదే కీలక పాత్ర. వందశాతం అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.

\- బి.శాంతిశ్రీ, పీడీ, ఐసీడీఎస్, శ్రీకాకుళం


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు

స్వర్ణాంధ్ర లక్ష్య సాధనకు కృషి చేయాలి

● రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయానంద్

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 24(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు అధికారులు మరింత చురుగ్గా పని చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. పీ-4 యాప్ వినియోగం, బంగారు కుటుంబాల గుర్తింపు, మార్గదర్శుల ఎంపిక, ఆర్టీజీఎస్ సేవలు, గ్యాస్, విద్యుత్తు పంపిణీ వ్యవస్థల్లో గల సమస్యలపై ఆయన గురువారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఇతర జిల్లా ఉన్నతాధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపడుతున్న చర్యల వివరాలను ఆయన సీఎస్‌కు వివరించారు. డాక్యుమెంట్ల అప్‌లోడ్ ప్రక్రియను వేగవంతం చేయడం, గృహ నిర్మాణం, ఇసుక సరఫరా తదితర అంశాలపై సీఎస్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, సీపీవో ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కేవీకే శాస్త్రవేత్తకు అవార్డు



అవార్డు అందుకుంటున్న శాస్త్రవేత్త బాలకృష్ణ

ఆమదాలవలస, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రం మత్స్యశాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణకు రాష్ట్రస్థాయి అవార్డు లభించింది. గురువారం కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ శాస్త్రవేత్తగా అవార్డు పొందిన డాక్టర్ సి.హెచ్.బాలకృష్ణను కేవీకే కో-ఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మితో పాటు ఇతర శాస్త్రవేత్తలు అభినందించారు. ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 57వ స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ నుంచి బాలకృష్ణ ఇటీవల ఈ అవార్డు అందుకున్నారు. ఆక్వాకల్చర్‌లో నూతన సాంకేతిక పద్ధతులు అవలంబించడం... రైతులకు వివిధ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం తదితర అంశాలలో చేసిన కృషికి గాను బాలకృష్ణ ఈ అవార్డుకు ఎంపికయ్యారు.

శ్రావణం.. శుభకరం

● నేటి నుంచి శ్రావణ మాసం
● శుభ కార్యక్రమాలకు అనువైన కాలం


అలంకరణలో శాంతమ్మతల్లి

నరసన్నపేట, జూలై 24(ఆంధ్రజ్యోతి): అత్యంత శ్రేష్ఠమైనదిగా చెప్పుకునే శ్రావణ మాసం వచ్చేసింది. శుక్రవారం నుంచే ఇది ప్రారంభం కానుంది. దీంతో ఊరూవాడా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంటున్నాయి. అమ్మవారి ఆలయాలకు కొత్త కళ వస్తోంది. మహిళలు సకల సౌభాగ్యాలతో పాటు శ్రీమహాలక్ష్మి కటాక్షం పొందేందుకు వ్రతాలు, ఉపవాసాలు, కుంకుమ పూజలు ప్రారంభించనున్నారు. ఈ మాసంలో వచ్చే అన్ని శుక్రవారాల్లోనూ శ్రావణ లక్ష్మికి పూజలు చేస్తారు. ఈ నెలలో ప్రధానంగా నాగుల పంచమి, ఆగస్టు 8న వరలక్ష్మీవ్రతం, 9న రాఖీపౌర్ణమి, 12న సంకష్ట హర చతుర్థి, 16న శ్రీకృష్ణాష్టమి, 19న అజ ఏకాదశి, 23న పోలాల అమావాస్య ఉన్నాయి. శ్రావణ మాసం సందర్భంగా ఆలయాలను అలంకరించే పనిలో నిర్వాహకులు ఉన్నారు. స్థానిక సంతోషిమాత, శాంతమ్మతల్లి, పార్వతీదేవి, మహాలక్ష్మీ దేవాలయాల్లో శ్రావణ శోభ కనిపిస్తోంది.

శుభకార్యాలకు అనువుగా...

వివాహాలు.. గృహప్రవేశాల వంటి శుభకార్యక్రమాలు ఈ నెలలోనే ఎక్కువగా నిర్వహించడం ఆనవాయితీ. దీనికి అనుగుణంగా ఈ నెల 26 నుంచి ఆగస్టు నెలాఖరు వరకు జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో వివాహాలు జరగనున్నాయి. గృహ ప్రవేశాలకూ అనేక మంది ముహూర్తాలు తీసుకున్నట్టు పురోహితులు చెబుతున్నారు.

శ్రీమహావిష్ణువు జన్మ నక్షత్రం పేరుతో...

శుక్రవారం నుంచి శ్రావణ సందడి మొదలవుతోంది. ఈనెల 25 నుంచి ఆగస్టు 23 వరకు శ్రావణ మాసం. ఈ మాసమంతా నోములు, వ్రతాలు, పండుగలతో ప్రతి ఇంటా సందడే. శ్రీమహావిష్ణువు జన్మనక్షత్రం శ్రవణం. ఆపేరు మీద వచ్చిన శ్రావణమాసం అంటే శ్రీలక్ష్మీ దేవికి ఎంతో ఇష్టం. ఈ నెల శుభ కార్యక్రమాలకు ఎంతో మంచిది.

\- జోస్యుల సంజీవశర్మ, సిద్ధాంతి, సత్యవరం


సరుబుజ్జిలి: ముంపునకు గురైన బుడ్డివలస పంట పొలాలు


టెక్కలి: సబ్‌కలెక్టర్ కార్యాలయానికి వెళ్లే మార్గంలో రహదారిపై నిలిచిన నీరు

భారీ వర్షం.. పొలాలు జలమయం

బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా భారీగా వర్షాలు కురుస్తున్నాయి. గురువారం కూడా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. పంట పొలాలు జలమయమయ్యాయి. వరి నారు నీట మునిగింది. వివిధ ప్రాంతాల్లోని రహదారుల్లో మోకాలి లోతున నీరు ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. సరుబుజ్జిలి మండలంలో ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరదనీరు కిందకు ప్రవహిస్తోంది. బుడ్డివలస, తెలికిపెంట, పాతపాడు, అగ్రహారం, వీరమల్లిపేట గ్రామాల్లో ఉన్న లోతట్టు ప్రాంతాల్లో పంట పొలాలు ముంపుబారిన పడ్డాయి. దీంతో రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరినారు లేతదశలో ఉండడం వల్ల నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉంటే కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు భయపడుతున్నారు.


నరసన్నపేట: గొట్టిపల్లి వద్ద పొలాల్లో నిలిచిన వరదనీరు

మరో మూడు రోజులు...

శ్రీకాకుళం, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలకు అవకాశం ఉందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ప్రస్తుత వాతావరణ స్థితిగతులపై రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ జారీ చేసిన ప్రత్యేక బులెటిన్‌ను ఆయన జిల్లా అధికారులకు అందించారు. అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ నెల 27వ తేదీ వరకు తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యంగా శుక్రవారం కొన్నిచోట్ల అతి భారీ వర్షాలు కురవచ్చని చెప్పారు. సముద్రంలో గాలుల వేగం గంటకు 65 కిలోమీటర్ల వరకు పెరిగే అవకాశం ఉందన్నారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. వాతావరణ శాఖ నివేదికల ప్రకారం కవిటి వరకూ తీరంలో 3.0 నుంచి 3.8 మీటర్ల వరకూ అలలు ఎగిసిపడే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. తీరప్రాంత గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అవసరమైతే తాత్కాలిక బస కేంద్రాలు సిద్ధం చేయాలని అన్ని మండలాల తహసీల్దార్‌లకు సూచించారు.

అత్యవసర సాయానికి...

అన్ని మండలాల్లో రెవెన్యూ, పోలీసు, రవాణా, విద్యుత్, ఆరోగ్య శాఖల సమన్వయంతో నిఘా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. పాతపట్నం, కొత్తూరు, ఇచ్ఛాపురం, కవిటి, నందిగాం, సంతబొమ్మాళి, గార మండలాల్లో అత్యవసర సేవలకు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రజలు అత్యవసర సాయం కోసం 'రాష్ట్ర ఎమర్జెన్సీ ఆపరేషన్స్ సెంటర్' నంబర్లు 112, 1070, 18004250101కు కాల్ చేయాలన్నారు.


రోడ్డుకు అడ్డంగా కూలిన మర్రి చెట్టు

రోడ్డుపై కూలిన మర్రిచెట్టు

● రాకపోకలకు అంతరాయం

వజ్రపుకొత్తూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): బాతుపురం-చినవంక గ్రామాల మధ్య గల ఆర్‌అండ్ బీ రోడ్డుకు పక్కన ఉన్న మర్రిచెట్టు గురువారం నేలకూలింది. ఇది రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో వాహనదారులు, బాటసారులు సుమారు మూడు గంటల పాటు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. పక్కనే అమ్మవారి ఆలయం ఉన్నప్పటికీ ఎలాంటి నష్టం వాటిల్లలేదు. 'ఒంటి మర్రి చెట్టు'గా ఈ ప్రాంతీయులు పిలుచుకునే చెట్టు కొమ్మలను స్థానిక యువత తొలగించి.. రాకపోకలను పునరుద్ధరించారు.

'గోల్డ్'మాల్!

(ఐదో పేజీ తరువాయి)

ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

టెస్టింగ్ కేంద్రాలతో ఒప్పందం

నరసన్నపేటలోని బంగారం షాపుల్లో ఆభరణాలు కొనుగోలు చేసి నాణ్యతను పరిశీలించేందుకు టెస్టింగ్ కేంద్రానికి తీసుకువెళ్లినా పెద్దగా ప్రయోజనం ఉండదనే ఆరోపణలు ఉన్నాయి. ఆభరణంపైన ఉన్న ముద్ర ఆధారంగా.. టెస్టింగ్ ఏజెన్సీ వారు నాణ్యత పరిశీలిస్తారు. ఆ సమయంలో నాణ్యత ఏమేరకు నిర్ధారించి విక్రయించారో యాజమానికి ఫోన్‌చేసి తెలుసుకొని... ఆయన చెప్పిన విధంగా ధ్రువీకరణ పత్రం ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని టెస్టింగ్ కేంద్రాలు బంగారు వ్యాపారుల పెట్టుబడితో నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ కేంద్రాల్లో నాణ్యత పరిశీలించే వ్యక్తికి తగిన సాంకేతిక పరిజ్ఞానం లేనివారే అధికశాతం ఉంటున్నారు.

యాసిడ్‌తో మాయ

కొందరు బంగారు వ్యాపారులు యాసిడ్ వేసి బంగారాన్ని కరిగించి వాటిని 100 గ్రాముల కడ్డీ రూపంలో బీఐఎస్ మార్కుతో విక్రయిస్తున్నట్టు తెలుస్తోంది. దీనిలో 80-90 శాతం బంగారం ఉండగా... మిగతా ఇతర లోహాలు ముఖ్యంగా కాపర్ మిక్స్ చేస్తారు. ధగధగ మెరిసేందుకు కొన్ని రసాయనాలను కలిపి... స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారంలా బిస్కెట్లు తయారు చేసి విక్రయిస్తున్నారు.

బంగారు వర్తకులకు తెల్లరేషన్ కార్డులు

నరసన్నపేటలో కోట్లాది రూపాయల బంగారు వ్యాపారాలు చేసే కొందరు వర్తకులకు తెల్లరేషన్ కార్డులు కూడా ఉన్నాయి. ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోకుండా వ్యాపారాలు నిర్వహించడంతో వీరి లావాదేవీలు అంతా బ్లాక్‌లోనే సాగుతుంటాయి. కొందరు వ్యాపారులకు తెల్లరేషన్ కార్డు కలిగి ఉండటంతో ఇటీవల ప్రభుత్వం అందించే తల్లికి వందనం పథకంలో లబ్ధి పొందిన సంఘటనలూ ఉన్నాయి.

అంతా సిండికేట్

బంగారు వ్యాపారులు నరసన్నపేటలో సిండికేట్‌గా వ్యవహరిస్తూ వినియోగదారులను దోచుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. షాపుల టర్నోవర్ మేరకు నెల నెలా కొంత మొత్తాన్ని వసూలు చేస్తారు. దీని కోసం గుమస్తాను కూడా నియమిస్తారు. వీరు వసూలు చేసిన మొత్తంలో కొంత నెలవారీగా పోలీసులు, జీఎస్టీ అధికారులకు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, తూనికల శాఖ అధికారులకు ముడుపులుగా చెల్లిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

చౌడేశ్వరికి ప్రత్యేక పూజలు


కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

నరసన్నపేట, జూలై 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ఉమాసహిత సోమేశ్వరాలయం ప్రాంగణంలో గల చౌడేశ్వరి దేవి జయంత్యుత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు సాముహిక కుంకుమార్చనలు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఉప్పు లింగరాజు, నీలకంఠశ్వరరావు, అర్చకులు దుర్గామల్లికార్జున స్వామి తదితరులు పాల్గొన్నారు.

బె'ధర'గొడుతున్నాయ్

(ఐదో పేజీ తరువాయి)

ఏ కూరగాయ అయినా సరే.. కిలో రూ.50 నుంచి రూ.70 వరకు విక్రయిస్తున్నారు. రైతుబజార్లలో సైతం ధరలు అందుబాటులో లేవని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. కోటబొమ్మాళి రైతుబజారు, శ్రీపురం మార్కెట్‌తోపాటు జిల్లాలో పలు ప్రాంతాల్లో మార్కెట్లలో నెల రోజుల కిందట బెండ, బీర, చిక్కుడు తదితర కూరగాయాలు కిలో రూ.20 నుంచి రూ.40 లోపు విక్రయించేవారు. ప్రస్తుతం వీటిధరలు పెరగడంతో అరకిలోలతో సరిపెట్టుకోవాల్సి వస్తోందని వినియోగదారులు పేర్కొంటున్నారు. పంట దిగుబడి తగ్గడం, మరోవైపు శ్రావణ మాసం పెళ్లిళ్ల సీజన్ కారణంగా కూరగాయల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా కూరగాయలు ధరలు పెరుగుతుండగా, చికెన్ ధరలు మాత్రం తగ్గుముఖం పట్టడంతో మాంసప్రియులు ఊరట చెందుతున్నారు. రెండు వారాల కిందట కిలో స్కిన్‌లెస్ చికెన్ రూ.270 నుంచి రూ.300 వరకు ఉండగా, ప్రస్తుతం రూ.180 నుంచి రూ.200కు లభిస్తోంది. శ్రావణమాసం కారణంగా ఈ ధర మరింత తగ్గేఅవకాశం ఉందని వ్యాపారులు చెబు తున్నారు.

అదనపు భారం

వారానికి ఒకసారి రైతుబజార్‌లో కూరగాయలు కొనుగోలు చేస్తాను. టమాటా, మిర్చి ధరలు రెట్టింపయ్యాయి. దొండ, బెండ, వంకాయ, బీర ధరలు అదేరీతిలో పెరిగాయి. నెల రోజుల కిందట సుమారు రూ.200 పెడితే కూరగాయల సంచి నిండేది. ప్రస్తుతం రూ.500 అయినా చాలడం లేదు. ధరల పెంపుతో సామాన్యులపై అదనపు భారం పడుతోంది.

\- వి.శశిభూషణరావు, ఊడికలపాడు, కోటబొమ్మాళి మండలం

ఏటా ముంపే!

(ఐదో పేజీ తరువాయి)

సమయంలో మాత్రం పొలాల్లో నీరు చేరి వరి పంట ముంపునకు గురవుతోంది.

కాలువలు సరిగ్గా లేక..

గెడ్డ పరీవాహక ప్రాంతాల్లో చెరువులకు వెళ్లే కాలువలు సరిగ్గా లేవు. కేదారిపురం నుంచి రత్తకన్న వరకూ దాదాపు 12 చెరువులు ఉంటాయి. ఈ కాలువలను బాగుచేస్తే భీమసముద్రం గెడ్డ ద్వారా వచ్చేనీటిని చెరువులకు మళ్లించవచ్చు. ఖరీఫ్‌లో సాగునీటి ఇబ్బందులు రాకుండా చూసుకోవచ్చు. తేలుకుంచి, రత్తకన్న, మండపల్లి గ్రామాల్లో పొలాలను ముంపుబారి నుంచి తప్పించవచ్చు. అలాగే బాలకృష్ణాపుం, మునిభద్ర, డెప్పూరు తదితర గ్రామాల్లో భూగర్భ జలాలను పెంపొందించవచ్చు. ఏటా ఈ గ్రామాల్లో నీటి ఎద్దడి ఉంటుంది. అదే సమయంలో ఖరీఫ్‌లో సాగునీటికి రైతులు అనేక ఇబ్బందులు పడుతుంటారు. ఈ నేపథ్యంలో భీమసముద్రం గెడ్డ విషయమై స్థానిక ఎమ్మెల్యే, విప్ బెందాళం అశోక్ చొరవచూపాలని రైతులు కోరుతున్నారు. ముంపు సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఏటా అవే ఇబ్బందులు

ఏటా భీమసముద్రం గెడ్డతో మాకు ఇబ్బందులు తప్పవు. గెడ్డ నిర్వహణ లేక పూర్తిగా పాడైంది. అందుకే నీటి ప్రవాహం సరిగ్గా ఉండదు. వర్షాల సమయంలో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు పొలాలపై పడి.. వందలాది ఎకరాలను ముంచేస్తుంది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిపెట్టాలి.

\- బుగత జగన్, రైతు, రత్తకన్న

అధికారులకు విన్నవించినా..

గెడ్డ ఉందన్న మాటే కానీ.. నీరు మాత్రం పొలాల మీదుగా పారుతోంది. గతంలో చాలాసార్లు అధికారులకు విన్నవించాం. కానీ సమస్య పరిష్కారం కాలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టిపెట్టాలి. గెడ్డను ఆధునికీకరించాలి. గెడ్డలో ఉన్న పూడికను తొలగించాలి.

\- లోహిదాస్, రైతు, బాలకృష్ణాపురం

ప్రతిపాదనలు పంపించాం

భీమసముద్రం గెడ్డ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వానికి సుమారు రూ.10లక్షలతో ప్రతిపాదనలు పంపాం. నిధులు విడుదలైన వెంటనే పనులు చేయిస్తాం. ఖరీఫ్‌లో సాగునీటి ఇబ్బందులు లేకుండా చేస్తాం.

\- మధుసూదన పాణిగ్రహి, ఇరిగేషన్ ఏఈ, ఇచ్ఛాపురం

జాషువా కవితలతో చైతన్యం


జాషువా చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): జాషువా సాహితీ చైతన్య పురుషుడని, సామాజిక అంశాలను కవితా వస్తువుగా ఎంచుకొని ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని విశాఖపట్నానికి చెందిన కవి బండి సత్యనారాయణ అన్నారు. కేంద్ర గ్రంథా లయంలో గురువారం శ్రీకాకుళం సాహితీ, సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో గుర్రం జాషువా వర్ధంతిని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సత్యనా రాయణ మాట్లాడుతూ.. జాషువా నవతరానికి మార్గదర్శకుడని అన్నారు. రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ తాను ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నా సరే సమాజం బాగుండాలని తపించిన వ్యక్తి జాషువా అని కీర్తించారు. కథానిలయం ట్రస్ట్ కార్యదర్శి దాసరి రామచంద్రరావు, రచయిత చింతాడ తిరుమలరావు, తెలుగు అధ్యాపకులు బాడాన శ్యామలరావు, కలమట దాసుబాబు, కె.శ్రీనివాసరావు, కంచరాన భుజంగరావు, పూజారి దివాకర్, నెట్టిమి రమణారావు, వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు జాషువా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

రోజుల తరబడి ఇలాగే..



రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

సోంపేట, జూలై 24(ఆంధ్రజ్యోతి): వర్షం కురిస్తే చాలు స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాల మార్గంలో వెళ్లాలంటే భయపడాల్సిందే. పాలకులు మారినా ఇక్కడి పరిస్థితి మారకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై నీరునిలిచింది. రోజుల తరబడి రోడ్డంతా బురదగా ఉంటుండడంతో విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. తరచూ ఇదే పరిస్థితి అని, అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అండర్ పాసేజ్ వద్ద దారుణంగా..



గోతులమయంగా ఉన్న అండర్ పాసేజ్ రోడ్డు

పొందూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): బొడ్డేపల్లి అండర్ పాసేజ్ వద్ద రోడ్డు దారుణంగా ఉంది. రోడ్డంతా గోతులమయమై ఎప్పుడు వాహనాలు పడి ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గోతుల్లో నీరుచేరి వాహనాలు వెళ్లే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. నిత్యం వందలాది మంది ప్రయాణించే ఈ మార్గంలో పరిస్థితి ఇలా ఉంటే ఎలా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

నడక నరకమే..

జి.సిగడాం, జూలై 24(ఆంధ్రజ్యోతి): చినుకు పడితే ఆ గ్రామంలోని రోడ్లు చిత్తడి గా మారి స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డంతా మట్టితో దారుణంగా ఉండడంతో నడిచేందుకు కూడా అవకాశం లేకుండా పోతోంది. ఏమాత్రం అజాగ్రత్తగా వెళ్లినా కాలుజారి బురదలో పడాల్సిందే. ఈ మార్గం లోనే పంట పొలాలు, గ్రామదేవతల పూజలకు, శ్మశాన వాటికకు వెళ్లాల్సి వస్తోందని పలువురు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చిత్తడిగా మారిన శ్మశాన వాటిక రోడ్డు

బాలకృష్ణాపురంలో కార్డన్ సెర్చ్

ఇచ్ఛాపురం, జూలై 24(ఆంధ్రజ్యోతి): అపరచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు అన్నారు. గురువారం బాలకృష్ణాపురంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఉదయం నుంచి సుమారుగా రెండు గంటల పాటు గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఆధార్ కార్డులు, ద్విచక్ర వాహనాల పత్రాలను పరిశీలించారు. వాహనాల పత్రాలు లేని 12 బైక్‌లను, చలానా ఫైన్ చెల్లించని వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు.

రోడ్డుపై వాహనాలు నిలిపితే చర్యలు

ఆమదాలవలస, జూలై 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రహదారితో పాటు రద్దీగా ఉండే మార్గాల్లో రోడ్డుకు అడ్డంగా వాహనాలు నిలిపితే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సీపాన కాంతారావు తెలిపారు. గురువారం ప్రధాన రహదారిలో పలు షాపుల వద్ద రోడ్డుకు అడ్డంగా ఉన్న వాహనాలను గుర్తించి హెచ్చరించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఎచ్చెర్ల, జూలై 24(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వి.సందీప్‌కుమార్ అన్నారు. సంతశీతారాంపురంలోని కింజరాపు ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం 'సంకల్పం' కార్యక్రమం నిర్వహించారు. గంజాయి, డ్రగ్స్‌కు బానిసలు కావద్దన్నారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.మోష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అపరిచితుల ఫోన్‌కాల్స్‌పై అప్రమత్తం

గార రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చిన ఫోన్ కాల్స్‌పై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ గంగరాజు కోరారు. వాడాడ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కలిగించారు. మాదక ద్రవ్యాలకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు.

ఎంటీఎస్ ఉపాధ్యాయుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

ఆమదాలవలస, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఎంటీఎస్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ బుధవారం రాత్రి తీవ్ర ఒత్తిడికి గురై మృతి చెందిన అల్లు రాజు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డీటీఎఫ్ మండల అధ్యక్షుడు పైడి రమణ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జలుమూరు మండలం శ్రీముఖలింగం పాఠశాలలో ఎంటీఎస్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ కంచిలి మండలం జి.ముకుందాపురానికి బలవంతంగా బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడు రాజు దూర ప్రాంతానికి బదిలీ కావడం తోనే మానసిక ఒత్తిడికి గురై గుండెపోటుతో మరణించారన్నారు. తక్షణం ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

అచ్యుతానందన్‌కు ఘన నివాళి

ఎచ్చెర్ల, జూలై 24(ఆంధ్రజ్యోతి): కేరళ మాజీ ముఖ్యమంత్రి వీఎస్ అచ్యుతానందన్ మృతికి సీఐటీయూ నేతలు సంతాపం తెలిపారు. అరిణాం అక్కివలస శ్యాంపిస్టన్స్ పరిశ్రమ ఆవరణలో గురువారం అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీ యూ జిల్లా కార్యదర్శి ఎన్‌వీ రమణ, నేతలు ఎం.అశోక్, ఎల్.నాగరాజు, జె.సురేష్, ఎం.సునీల్, పి.శ్రీను, కృష్ణారావు, ఎస్.శ్రీను పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి చేయూత

సోంపేట రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): పొత్తంగి గ్రామానికి చెందిన కాసి మోహనరావు అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులుపడుతోందని తెలుసుకుని మాకన్నపురం ఎంఎస్ఆర్ సేవా సంఘం ప్రతినిధులు సాయం అందించారు. గురువారం మృతుడి భార్య జయమ్మను పరామర్శించి రూ.35,116 నగదును అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్దిల నాగేశ్వరరావు, సంఘం సభ్యులు బతకల దీర్ఘారావు, మద్దిల అప్పయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర చీఫ్ మాధవ్‌ను కలిసిన నేతలు

పాత శ్రీకాకుళం, జూలై 24(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎస్ మాధవ్‌ను జిల్లా పార్టీ నేతలు గురువారం విశాఖపట్నంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. మాధవ్‌ను కలిసి అభినందించిన వారిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు, జిల్లా ఇన్‌చార్జి విజయానంద్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు చింతు పాపారావు, పేడాడ సూరపు నాయుడు, నేతలు బడే తాతారావు, సంపతిరావు నాగేశ్వరరావు, తేజేశ్వరరావు, కరుకోల రామారావు పాల్గొన్నారు.

శిక్షణ కార్యక్రమాలను వినియోగించుకోండి

పాత శ్రీకాకుళం, జూలై 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని వినియోగించుకోవాలని పశు సంవర్థక శాఖ డీడీ డా కె.రాజగోపాలరావు అన్నారు. స్థానిక కార్యాలయంలో గొర్రెలు, మేకల పెంపకందారులకు వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చారు. సమగ్ర గొర్రెల అభివృద్ధి పథకం ఈడీ డా.బమ్మిడి ఓగేశ్వరరావు, వెటర్నరీ పాలీ క్లినిక్ డైరెక్టర్ డా.బి.గణపతిరావు, ఆమదాలవలస ఏడీ డా.జె.నారాయణరావు వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం లిమిటెడ్ చైర్మన్ కుజ్జు తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక కార్యాలయాల నిర్వహణకు టెండర్లు ఖరారు

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 24(ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక కార్యాలయాల నిర్వహణకు పొందూరు, మందస ఔట్ పోస్టు టెండర్లను కలెక్టరేట్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సమక్షంలో ఖరారు చేశారు. పొందూరుకు గొలివి శ్రీనివాసరావుకు రూ.15,50,000, మందసకు జి.ఇందుమతికి రూ.16,00,00లకు ఖరారు చేశారు. జిల్లా అగ్ని మాపక అధికారి జె.మోహనరావు, శ్రీనుబాబు, డీఎఫ్‌వో నాగేంద్ర పాల్గొన్నారు.

శ్రమదానం చేసి.. గోతులు పూడ్చి

ఇచ్ఛాపురం, జూలై 24(ఆంధ్రజ్యోతి): పాత బస్టాండ్ వద్ద నెలల తరబడి రోడ్డంతా గోతులమయంగా తయారై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో సమస్యను గుర్తించిన ఆటో డ్రైవర్లు గురువారం శ్రమదానం చేసి గోతులను పూడ్చారు. బుధవారం రాత్రి స్కూటీపై వెళ్తున్న ఇద్దరు బాలికలు గోతిలో పడి గాయాలపాలయ్యారు. వారిని ఆటో డ్రైవర్లు ఆసుపత్రికి తరలించారు. అధికారులు పట్టించుకోవడం లేదని, తామైనా గోతులను పూడ్చాలని నిర్ణయించుకుని శ్రమదానం చేశారు. రోడ్డులోని సుమారు 15 గోతులను పూడ్చారు. దీంతో వాహనదారులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ ప్రతినిధులు ఎర్రయ్య రెడ్డి, మోహన్, హరి తదితరులు పాల్గొన్నారు.



గోతులను పూడుస్తున్న ఆటో డ్రైవర్లు

ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపో విడదీస్తే సహించేదిలేదు

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీస్తే సహించేది లేదని వామపక్ష నేతలు అన్నారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్ ఎదుట వామపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.కృష్ణమూర్తి, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు మాట్లాడుతూ.. ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను ఎవరి ప్రయోజనాల కోసం విడదీసి టెక్కలిలో కొత్త డిపో ఏర్పాటు చేస్తున్నారో మంత్రి అచ్చెన్నాయుడు చెప్పాలని డిమాండ్ చేశారు. టెక్కలిలో కొత్త డిపో ఏర్పాటు వల్ల రాష్ట్ర, జిల్లా ప్రజలకు ఎటువంటి ప్రయోజనం ఉందో తెలియజేయాలన్నారు. ఎచ్చెర్లలో 1986లో దళిత కుటుంబాల నుంచి 4 ఎకరాల భూమిని ఎటువంటి పరిహారం ఇవ్వకుండా ప్రభుత్వం తీసుకుందని, అక్కడ యారక్ బాట్లింగ్ యూనిట్ ఏర్పాటు చేసి దళిత కుటుంబాలను కార్మికులు, హమాలీలుగా ఉపాధి కల్పించారన్నారు. ఇప్పుడు ఇక్కడ 80 మంది హమాలీలుగా లోడింగ్, అన్ లోడింగ్ పనులు చేస్తూ 350 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. ఇప్పుడు ఈ డిపోను విభజించడం వల్ల వారంతా ఉపాధి కోల్పోతారని ఆవేదన వ్యక్తంచేశారు. ఎచ్చెర్ల డిపోను యధావిధిగా కొనసాగించి హమాలీల ఉపాధిని కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నేతలు సంతోష్, కె.సూరయ్య, ఎల్.రామప్పడు, కేదారేశ్వరరావు, ఏపీ బీసీఎల్ హమాలీల యూనియన్ నాయకులు నిడిగంట్ల రమణ, రాము, సొంట్యాన శ్రీనివాసరావు, నవిరి సురేష్, లండ సీతారాం తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న వామపక్ష నేతలు

పూర్తిస్థాయి ఎరువులందేదెప్పుడు?

సరుబుజ్జిలి, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖరీఫ్ వరి సాగుచేసే రైతులకు ఎరువులు పూర్తిస్థాయిలో ఎప్పుడు అందుతాయా అని రైతులు ఎదురుచూస్తున్నారు. గత వారం రోజుల నుంచి వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సరఫరా చేస్తున్న యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ నిరాశ చెందుతున్నారు. కొన్ని గ్రామాల్లో గ్రామ సచివాలయాల వద్ద గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడిన రైతులు ఎరువుల సరఫరాపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో రైతుల మధ్య తోపులాటలు, వాగ్వాదా లు చోటు చేసుకుంటున్నాయి. మండలంలోని 21 గ్రామ పంచాయతీలకు చెందిన సుమారు 5 వేల హెక్టార్లలో ఖరీఫ్ వరి సాగు చేస్తున్నారు. దీనికి సుమారు 800 టన్నుల యూరియా అవసరం ఉంటుందని వ్యవసాయశాఖ అంచనా. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగుచర్యలు తీసుకోవాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఏవో మన్మథరావు వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా ఖరీఫ్‌కు 800 టన్నుల యూరియా వివిధ గ్రామాల్లో పంపిణీ చేయడం జరిగిందని, మిగిలిన మూడు టన్నులు రప్పించేందుకు జిల్లా అధికారులకు నివేదికలు పంపామన్నారు.



సరుబుజ్జిలి గ్రామ సచివాలయం వద్ద యూరియా కోసం క్యూలో ఉన్న రైతులు

కేజీబీవీలో డిప్యూటీ కలెక్టర్ విచారణ

పొందూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): లోలుగు కేజీబీవీలో అక్రమాలు, ప్రిన్సిపాల్ సౌమ్యపై వచ్చిన ఫిర్యాదుల మేరకు డిప్యూటీ కలెక్టర్ పద్మలత గురువారం విచారణ చేప ట్టారు. ప్రిన్సిపాల్ పనితీరుపై ఎస్ఎంసీ చైర్‌పర్సన్ కిరణ్ కుమారి, వైస్‌చైర్మన్ పారన్నాయుడు రాష్ట్ర విద్యా శాఖామంత్రి లోకేశ్, ఎమ్మెల్యే కూన రవికుమార్, విద్యాశాఖ ఉన్నతాధి కారులకు ఇచ్చిన ఫిర్యాదుతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ విచారణ చేపట్టారు. మూడు రోజులుగా అధికారులు తనిఖీలు చేపట్టారు. డిప్యూటీ కలెక్టర్ పద్మలత విస్తృతంగా తనిఖీ చేసి రికార్డులు, ఖర్చులకు సంబంధించి చెక్కులను పరిశీలించి ప్రిన్సిపాల్ సౌమ్యను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులతో మాట్లాడారు. వివాదాల్లోకి విద్యార్థినులను తీసుకురావద్దని సిబ్బందికి హెచ్చరించారు. వసతులు, భోజన సదుపాయాలపై ఆరా తీశారు. నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు డిప్యూటీ కలెక్టర్ తెలిపారు.



రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ పద్మలత

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం: అశోక్

సోంపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం పెంపొందుతుందని, ఈ దిశలో ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని ఎమ్మెల్యే, విప్ బెందాళం అశోక్ అన్నారు. వ్యవసాయశాఖ భవనంలో గురువారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రైతులకు జీడి మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీఏ టి.భవానీశంకర్, ఏవో బి.నరసింహ మూర్తి, ఉద్యానవన శాఖాధికారి పి.మాధవీలత, టీడీపీ రాష్ట్రకార్యదర్శి సూరాడ చంద్ర మోహన్, పార్టీ మండల అధ్యక్షుడు ముద్దు కుమార్, నాయకులు చిత్రాడ శ్రీనివాసరావు, మద్దిల నాగేశ్వరరావు, బీన ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



జీడి మొక్కలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

మత్స్యకార కుటుంబానికి తోడ్పాటు



బాధిత కుటుంబానికి నగదు అందిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

గార రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బందరువానిపేటలో బుధవారం పడవ ప్రమాదంలో మృతి చెందిన బడే గజేంద్ర కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. బాధిత కుటుంబానికి గురువారం తక్షణ సాయం రూ.10 వేలు అందించి ఓదార్చారు. అనంతరం వమరవెల్లి, కళింగపట్నం, తోణంగి పంచాయతీల్లో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. గ్రామాల్లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

మాతృశాఖకు ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ

శ్రీకాకుళం, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శాంతిశ్రీని మాతృశాఖకు పంపుతూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం రాత్రి ఉత్తర్వులు విడుదల చేసింది. సహకార సంఘాల రిజిస్ట్రార్ కార్యాలయంలో డిప్యూటీ రిజిస్ట్రార్ నుంచి ఇక్కడకు డెప్యుటేషన్‌పై సుమారు ఏడాది కిందట పీడీగా వచ్చారు. వైఎస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల ఐసీడీఎస్ పీవో ఐ.విమలను శ్రీకాకుళం ఏపీడీగా బదిలీ చేశారు. ఆమదాలవలస సీడీపీవో కె.నాగమణికి పదోన్నతి కల్పిస్తూ డెప్యుటేషన్‌పై ఏపీ మహిళా కమిషన్ డైరెక్టర్‌గా నియమించారు. మందస ఐసీడీఎస్ ప్రాజెక్టులో బాలల అభివృద్ధి ప్రాజెక్టు అధికారి డి.రాధామాధవికి పదోన్నతి ఇస్తూ బాపట్ల జిల్లా బాలల అభివృద్ధి ప్రాజెక్టు అధికారిగా నియమించారు. ఈ మేరకు స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రభుత్వ కార్యదర్శి ఎ.సూర్యకుమారి ఉత్తర్వులను జారీ చేశారు.

విధులు సక్రమంగా నిర్వహించాలి

ఆమదాలవలస, జూలై 24(ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించాలని మునిసిపల్ కమిషనర్ తమ్మినేని రవి అన్నారు. గుర వారం 20 వార్డు వెంగళరావు కాలనీ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు.

'అయ్యంకి'కి ఘన నివాళి

శ్రీకాకుళం కల్చరల్ జూలై 24(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య 135వ జయంతిని బలగ హడ్కో కోలనీ శాఖాగ్రంథాలయంలో గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి పి.ఉగ్రసేను పూలమాల వేసి నివాళులర్పించారు. భారత దేశ చరిత్రలో గ్రంథాలయ వ్యవస్థ ఉన్నంత కాలం అయ్యంకి వెంకట రమణయ్య పేరు చిరస్థాయిగా ఉంటుందన్నారు. పలువురు పాఠకులు పాల్గొన్నారు.

● లావేరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): గ్రంథాల య ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య జయంతిని గురువారం శాఖా గ్రంథాలయంలో నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి గ్రంథాలయాధికారి ఎం.శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. పలువురు విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు మంత్రి 'ఆనం' శ్రీకూర్మంలో పర్యటన

గార, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణ రెడ్డి శుక్రవారం ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి శ్రీకూర్మంలో పర్యటించనున్నారని ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. గ్రామంలో నిర్వహించనున్న సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

ఆగస్టు 10 లోగా పి-4పై నివేదిక

పొందూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి-4 సర్వే నివేదికను ఆగస్టు 10వ తేదీలోగా అందజేయాలని పొందూరు మేజర్ పంచాయతీ ఈవో కె. మోహన్ బాబు అన్నారు. పంచాయతీ కార్యాలయంలో గురువారం సర్పంచ్ ఆర్.లక్ష్మి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు ఎంపీటీసీ ఎ.వాణి, నాయకులు డి.రవి, సిబ్బంది పాల్గొన్నారు.

రాజరాజేశ్వరికి క్షీరాభిషేకం

శ్రీకాకుళం కల్చరల్ జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఉమారుద్ర కోటేశ్వరాలయంలోని రాజ రాజేశ్వరి అమ్మవారికి ఆషాఢ బహుళ అమావాస్య సందర్భంగా క్షీరాభిషేకం చేశారు. అర్చకుడు ఆరవెల్లి శ్రీరామశర్మ ఆధ్వర్యంలో పసుపు-కుంకుమతో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.







మరమ్మతులు లేక.. నిర్వహణకు నోచుకోక

● చినుకుపడితే బురదమయం ● అడుగడుగునా గోతులు కావడంతో అగచాట్లు ● ఇదీ జిల్లాలో పలు రహదారుల దుస్థితి

జిల్లాలోని పలురహదారులకు ఏళ్ల తరబడి నిర్వహణ పనులు, మరమ్మతులు లేకపోవడంతో అధ్వానంగా మారాయి.ప్రధానంగా చినుకుపడితే బురదమయమవుతున్నాయి. దీనికి తోడు గోతులమయంకావడంతో వర్షం నీరుచేరడం వల్ల చోదకులు అగచాట్లకు గురవుతున్నారు. గత ఐదేళ్లలో వైసీపీ హయాంలో రోడ్ల నిర్వహణపై కనీస దృష్టిసారించకపోవడం వల్లే ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్లు అధ్వానంగా మారుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.


టెక్కలి: మండాపొలం కాలనీ రోడ్డుపై నిలిచిన నీరు


నందిగాం: గోతులమయమైన వల్లభరాయుడుపాడు రహదారి

●నందిగాం, జూలై 24(ఆంధ్రజ్యోతి): నరేంద్రపురం జంక్షన్ నుంచి వల్ల భరాయుడుపాడు వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. మూడు కిలోమీటర్లు పొడవున్న రహదారి అడుగడుగునా గోతులమయమై వర్షం నీరు చేరడంతో చీకటిపడిన తర్వాత వాహనచోదకులు ఇబ్బందిపడుతున్నారు. ఈ రహదారిలో కొండపేట, వల్లభరాయుడుపాడు, దేవాడ, దొడ్డరామ చంద్రాపురంతో పాటు వజ్రపుకొత్తూరు మండలంలోని పాతటెక్కలి వెళ్లేవారంతా రాకపోకలు సాగిస్తున్నారు.

●పాతపట్నం, జూలై 24(ఆంధ్రజ్యోతి): రంకిణి బీటీ రోడ్డు ఏళ్ల తరబడి మరమ్మతులు లేకపోవడంతో రాళ్లుతేలింది. దీంతో ద్విచక్రవాహనచోదకులు స్లిప్‌కావడంతో బోల్తాపడి గాయపడుతున్నారు. పాతపట్నంలోని ఆలాంధ్రరోడ్ నుంచి దాసుపురం, బురికిపేట, భగంతర మీదుగా రంకిణి వరకు బీటీరోడ్డు నాబార్డునిధులతో దశాబ్దకాలం కిందట ఏర్పాటుచేశారు.

●టెక్కలి, జూలై 24(ఆంధ్రజ్యోతి): టెక్కలిలోని మండాపొలం కాలనీలో చినుకుపడితే నీరు రోడ్లపైకి చేరి చెరువును తలపిస్తోంది. కాలనీలో పలు చోట్ల కల్వర్టులు నిర్మించినా రోడ్లు ఏర్పాటుచేయకపోవడంతో వర్షం కురిస్తే ఇళ్లనుంచి బయటకు రావడానికి ఇబ్బందిపడుతున్నారు.

●ఎల్.ఎన్.పేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలికాం- బత్తిలి ప్రధానరోడ్డు రోడ్డు అడుగడుగునా గోతులమయంకావడంతో రాకపోకలకు అగచాట్లు తప్పడంలేదు. అత్యవసర సమయాల్లో వైద్యం కోసం గ్రామాలనుంచి పట్టణ ప్రాంతాలకు తరలించేందుకు బంధువులు అవస్థలు పడుతున్నారు.ఈ రోడ్డు గుండా శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస, హిరమండలం మీదుగా కొత్తూరు, బత్తిలి, హిరమండలం, పాతపట్నం, పర్లాకిమిడి వరకు వాహనాల రాక పోక లతో రద్దీగాఉంటోంది.బొర్రంపేట, కోవిలాంకాలనీ, తురకపేట జంక్షన్ల వద్ద రోడ్డు అధ్వానం మారింది.

●జలుమూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి అబ్బాయిపేట నుంచి తలతరియా వరకుగల రోడ్డు గోతులమయంకావడంతో ప్రయణికులు భయాందోళన చెందుతున్నారు. అబ్బాయిపేట నుంచి తలతరియా వరకు గల రోడ్డుపై కె.ఎల్.ఎన్.పేట, ఊడిగలపాడు, లింగాలపాడు, కైలాసపురం, ఎర్రన్నపేట, సంతలబైలి, విశ్వనాధపురం తదితర గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తలతరియా రహదారికి నిధులు మంజూరు చేయించి పక్కా రోడ్డు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.


పాతపట్నం: రాళ్లుతేలిన రంకిణి బీటీ రోడ్డు


ఎల్.ఎన్.పేట: బొర్రంపేట వద్ద గోతులమయమైన అలికాం-బత్తిలి ప్రధానరోడ్డు


జలుమూరు: అధ్వాన్నంగా మారిన అబ్బాయిపేట వద్ద తలతరియా రోడ్డు

కందమాల్ టు బెంగళూర్

● 6.600 కేజీల గంజాయి స్వాధీనం

ఇచ్ఛాపురం, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఒడిశాలోని కందమాల్ జిల్లా నుంచి కర్ణాటకలోని బెంగళూర్‌కు గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు సీఐ మీసాల చిన్నమనాయుడు తెలిపారు. గురువారం పట్టణ ఎస్ఐ ముకుందరావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సీఐ కథనం మేరకు.. కొరాపుట్ జిల్లాకు చెందిన ప్రశాంత్ కుమార్‌పాడి, గంజాం జిల్లాకు చెందిన కందులు పూర్ణచంద్ర శానాపతి కందమాల్ జిల్లాకు చెందిన బపూని దిఘాల్ వద్ద గంజాయిని కొనుగోలు చేశారు. దీనిని బెంగళూర్‌లో ఉంటున్న ఆలి అలియాస్ సర్దార్ అనే వ్యక్తికి అమ్మే క్రమంలో గురువారం ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. గంజాయి తరలిస్తున్నట్లు పట్టణ ఎస్ఐ ముకుందరావుకు సమాచారం వచ్చింది. వెంటనే ఆయన సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్‌కు చేరుకొన్నారు. అక్కడ అనుమానాస్పదంగా కనిపించిన వీరిద్దరిని పట్టుకుని తనిఖీచేశారు.వారి వద్ద నుంచి6 కేజీల 600 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు.

17 మద్యం సీసాలు..

ఆమదాలవలస, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధి గణేష్ నగర్‌కు చెందిన ఎస్.సరళను 17 మద్యం బాటిళ్లతోఅరెస్టు చేసినట్లు ఎస్ఐ సీపాన కాంతారావు తెలిపారు. గురువారం ఉదయం అందిన సమాచారం మేరకు గణేష్ నగర్‌లోని ఆమె ఇంటిలో తనిఖీ నిర్వహించామన్నారు. అక్రమంగా 17 మద్యం బాటిళ్లను నిల్వ ఉంచినట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

యువతి అదృశ్యం

లావేరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): బుడుమూరుకు చెందిన పి.ఉషారాణి (19)అదృశ్యమైనట్లు ఆమె తల్లి లీలాకుమారి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ జి.లక్ష్మణరావు తెలిపారు. ఉషారాణి ఈనెల 15న విజయనగరంలో ఓప్రైవేటు ఉద్యోగానికి వెళ్తాననిచెప్పి ఇంటినుంచి బయలుదేరి వెళ్లి నేటికీ రాలేదని, ఆచూకీ తెలియలేదని ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కామ్రేడ్ సుబ్బారావు పాణిగ్రాహి సతీమణి మృతి


సురేఖ పాణిగ్రాహి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పలాస రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం గిరిజన సాయుధ రైతాంగ పోరాటంలో అశువులు బాసిన విప్లవ కవి, కామ్రేడ్ సుబ్బారావు పాణిగ్రాహి సతీమణి సురేఖపాణిగ్రాహి(83) గురువారం మృతిచెందారు. సుబ్బారావు పాణిగ్రాహి 1968లో జరిగిన శ్రీకాకుళం గిరిజన సాయుధ పోరాటంలో మృతి చెందిన విషయం విదితమే. అప్పటి నుంచి ఆయన ఆశయాలకోసం కృషిచేసింది. సుబ్బారావు పాణిగ్రాహి శ్రీకాకుళం సాయుధ గిరిజనపోరాటంలో పాల్గొన్న సమయంలో ఆయనకు వెన్నుదన్నుగా సురేఖ నిలిచారు. సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన ఆమె మొదట సోంపేటలో సుబ్బారావుతో కలిసిఉండేవారు. పార్టీ పిలుపు మేరకు 1964లో సుబ్బారావు పాణిగ్రాహి పూర్తిస్థాయిలో శ్రీకాకుళం సాయుధ పోరాటంలోకి చేరిన తర్వాత ఆమె ఆయన్ను అనుసరించి బొడ్డపాడు గ్రామానికి చేరుకొన్నారు.సుబ్బారావు మరణించినతర్వాత 57ఏళ్లు ఆమె ఒంటరిగానే ఉన్నారు. కాగా ఆమెకు సంతానం లేకపోవడంతో ఆమె అక్క కుమారుడు వద్ద చివరి జీవనమంతా సాగించింది.వివిధ విప్లవ పార్టీల నాయకులు ఆమె మృతదేహన్ని సందర్శించి నివాళులర్పించారు శుక్రవారం అంత్యక్రియలు జరగనున్నాయని విప్లవ పార్టీల నాయకులు, ఆమె బంధువులు తెలిపారు.

మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు జోగారావు తల్లి..

వజ్రపుకొత్తూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): బాతుపురంలో మావోయిస్టు కేంద్రకమిటీ సభ్యుడు మోటూరు జోగారావు మాతృమూర్తి చిన్నపిల్లమ్మ (85) గురువారం మృతిచెందారు. చిన్నపిల్లమ్మకు ఇద్దరు కుమార్తెలు, నలుగురు కుమారులు. కాగా రెండో కుమారుడు జోగారావు సుమారు 25 ఏళ్లకిందట మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితుడై చేరగా, ప్రస్తుతం కేంద్రకమిటీ సభ్యుడిగా కొనసాగుతున్నారు. కాగా జోగారావును జనజీవన స్రవంతిలో కలిసిపోవాలని అప్పటి ఎస్పీలు అమ్మిరెడ్డి, రాధిక తదితరులు బాతుపురం గ్రామానికి వచ్చి చిన్నపిల్లమ్మను కోరిన విషయం విదితమే. తన కుమారుడు చాలారోజులుగా కలవడంలేదని, ఆయన ఇష్టప్రకారం నక్సలైట్ ఉద్యమంలో చేరాడని ఆమె ఎస్పీలకు అప్పట్లో తెలియజేశారు.

గుణాత్మకమైన విద్యనందించాలి

జలుమూరు (సారవకోట), జూలై 24 (ఆంధ్రజ్యోతి):ప్రాథమికస్థాయి నుంచే క్రమశిక్షణతో కూడిన గుణాత్మకమైన విద్యనందించాలని ఎంఈవో ఎం.వి.రమణ తెలిపారు. సారవకోట మండలంలోని కిట్టాలపాడు, మూగుపురం, కొమ్మునరియాపల్లి, బెజ్జి ప్రాథమిక పాఠశాలలను తనిఖీచేశారు.

తర్లాకోటలో శ్మశానం పరిశీలన


ఆక్రమణ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పలాసరూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తర్లాకోట సంస్థానాధీశులకు చెందిన శ్మశాన భూమిని తహసీల్దార్ కళ్యాణ చక్రవర్తి, రెవెన్యూ అధికారులు స్థలం పరిశీలించారు.గురువారం శ్మాశానాన్నీ వదల్లే శీర్షికతో ఆంధ్రజ్యోతి కథనం ప్రచురితంకావడంతో రెవెన్యూ అధికారులు స్పందించారు. ఎంత మేర ఆక్రమణ జరిగింది, ఆ స్థలాలు ఎవరి ద్వారా వారికి దాఖలుపడ్డాయో పూర్తివివరాలు సేకరించాలని, ఎవరి వద్దైనా కొనుగోలు చేశారా, లేక ఆక్రమించారా అన్న వివరాలను అందజేయాలని వీఆర్వో, సర్వేయరుకు తహసీల్దార్ ఆదేశించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మెనూ అమలు చేయకపోతే చర్యలు

● గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

మెళియాపుట్టి, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఆశ్రమపాఠశాలల్లో మెను అమలు చేయకపోతే చర్యలు తీసుకుంటామని గిరిజనశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. గురువారం ఆంధ్రజ్యోతిలో 'వడ్డించిందే మెనూ.. పెట్టిందేతిను' శీర్షికతో కథనం ప్రచురితం కావడంతో ఆమె స్పందించి ఫోన్‌లో మాట్లాడారు. ఐటీడీఏ పీవోతో విచారణ నిర్వహిస్తామన్నారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టకపోతే చర్య తీసుకుంటామని హెచ్చరించారు. ఐటీడీఏ ఆశ్రమ పాఠశాలల తీరుపై అధికారులతో సమీక్షిస్తానని తెలిపారు. అధికారులతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

అర్జీదారుల సమస్యల పరిష్కారానికి కృషి

● నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి


సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బాధిత కుటుంబానికి అందజేస్తున్న బగ్గు రమణమూర్తి

పోలాకి, జూలై 24(ఆంధ్రజ్యోతి): అర్జీదారుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గురమణమూర్తి భరోసా ఇచ్చారు. గురువారం మబగాం పరిధిలోని కత్తెరవానిపేట క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మబగాంలో లింగుబేరిభూలోకరావు కిడ్నీ వ్యాధి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.79,667 చెక్కు, అదేగ్రామానికి చెందిన లావేటి హర్షబ్రెయిన్ సర్జరీ కోసం రూ2,28,525లు, పందిరి నగేష్ అనారోగ్యం వల్ల వైద్యఖర్చుల కోసం రూ26218ల సీఎంఆర్ఎఫ్ చెక్‌లను ఎమ్మెల్యే అందజేశారు.కార్యక్రమంలో కాయర వి, గోవిందరావు, మెండరమణ, సీతారాం పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఆసరా

● పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం, జూలై 24(ఆంధ్రజ్యోతి): పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఆసరాగా నిలుస్తోందని ఎమ్మెల్యే మామిడిగోవిందరావు తెలిపారు. పాతపట్నంలోని శివశంకర్ కాలనీకి చెందిన బోసెల కార్తీక్‌కు కిడ్నీమార్పిడికి వైద్యఖర్చుల నిమిత్తం తండ్రి లక్ష్మీనారాయణ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే చొరవచూపి సీఎంఆర్ఎఫ్ మంజూరు చేయించారు. గురువారం క్యాంపు కార్యాలయంలో కార్తీక్ తండ్రి లక్ష్మీనారాయణకు రూ.2.56లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుఅందజేశారు. కార్యక్రమంలో నాయకులు పైల బాబ్జీ, సతీష్ శివాల చిన్నయ్య, దుర్గాప్రసాద్, నందిగామ ఆనందరావు, సన్యాసిరావు, మన్మథరావు పాల్గొన్నారు.


కార్తీక్ కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న మామిడి గోవిందరావు

విద్యార్థి దశలోనే పఠనాసక్తి పెంచాలి

విద్యార్థి దశనుంచే ఆటపాటలతోపాటు పుస్తకపఠనాసక్తిని పెంచాలని వక్తలు పిలుపునిచ్చారు. గురువారం జిల్లాలోని శాఖా గ్రంథాలయాల్లో గంథాలయోద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతి పురస్కరించుకుని చిత్రపటానికి పూలలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా గ్రంథాలయ ఉద్యమంలో చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు.

●కోటబొమ్మాళి, జూలై 24 (ఆంధజ్యోతి): కోటబొమ్మాళి శాఖాగ్రంథాలయంలో అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి ఎంపీపీ పాఠశాల హెచ్ఎం వెంకటరమణ పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో గ్రంథాలయాధికారి రామకృష్ణఉపాధ్యాయులు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

●టెక్కలి, జూలై 24(ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖాగ్రంథాలయంలో అయ్యంకి వెంకటరమణ చిత్రపటానికి గ్రంథపాలకురాలు బి.రూపావతి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు.

●పాతపట్నం, జూలై24(ఆంధ్రజ్యోతి):స్థానికశాఖాగ్రంథాలయంలో విశ్రాంత శాఖాగ్రంథాలయాధికారి కాళ్లరాజు, గంథాలయాధికారి జి.సాయమ్మ అయ్యంకి వెంకటరమణయ్య జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో పి.రామరాజు, దుర్గారావు భోగేశ్వరరావు ప్రవీణ్ శంకర్ వాసుదేవరావు పాల్గొన్నారు.


టెక్కలి: శాఖాగ్రంథాలయంలో అయ్యంకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారి రూపావతి, పాఠకులు

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

మెళియాపుట్టి, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొసమాళ పంచాయతీకార్యదర్శిగా గతంలో పనిచేసిన ఎ.మనోహర్‌ను సస్పెండ్‌చేస్తూ గురువారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపీడీవో నరసింహప్రసాద్ పండా తెలిపారు.గతంలో కొసమాళ కార్యదర్శిగా పనిచేసిన సమయంలో వైసీపీ ప్రభుత్వంహయాంలో నిధులు పనులు చేయకుండానే డ్రాచేసినట్లు, నిధులు దుర్వినియోగానికి పాల్పడినట్లు గ్రామస్థులు ఫిర్యాదుచేసిన విషయం విదితమే. ఈ విషయంపై పలుసార్లు టెక్కలి డీఎల్‌పీవో బాలగోపాలం విచారణ నిర్వహించారు. ఈ నేపథ్యంలో సర్పంచ్ ఉర్లాన రవికుమార్ చెక్‌పవర్‌ను రద్దుచేసిన విషయం విదితమే. అయితే ఎట్టకేలకు కార్యదర్శికి సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. నిధులఖర్చులకు సంబంధించి రికార్డులు చూపించకపోవడంతో సస్పెన్షన్ చేసినట్లు పేర్కొన్నారని ఎంపీడీవో తెలిపారు. మనోహర్ ప్రస్తుతం వెంకటాపురం కార్యదర్శిగా పనిచేస్తున్నారు.

ఇద్దరు సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

మెళియాపుట్టి సచివాలయంలో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు ఎంపీడీవో నరసింహ ప్రసాద్‌పండా తెలిపారు. మెళియాపుట్టి రెడ్డివీధికి చెందిన మూగ కృష్ణవేణి తన ఇద్దరు కుమారులకు తల్లికి వందనం మంజూరుకాలేదు. ఈనేపథ్యంలో బతికి ఉన్నా చంపేశారు శీర్షికతో ఆంధ్రజ్యోతి కథనం ప్రచురితకావడంతోపాటు ఆమె జేసీని కలిశారు. దీంతో కంప్యూటర్ ఆపరేటర్ యుగంధర్, వెల్ఫేర్ సెక్రటరీ దిలీప్‌లకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు ఎంపీడీవో తెలిపారు.కలెక్టర్‌ఆదేశాల తదుపరి చర్యలుమేరకు ఉంటాయని చెప్పారు. ఆ కుటుంబానికి తల్లికి వందనం డబ్బులు జమచేయడంతోపాటు హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌పై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

బూరగాం ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

పాతపట్నం, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూరగాం గ్రామ సచివాలయంలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ కుమారి పొల్లాయ్‌పై పీడీ బి.సుధాకర్ గురువారం విచారణ నిర్వహించారు. పనులకు రానివారికి, దూరప్రాంతాల్లో ఉన్నవారికి మస్తర్లు వేసి అక్రమాలకు పాల్పడడంతోపాటు పలు ఆరోపణలపై ఫిర్యాదు నేపథ్యంలో విచారణ నిర్వహించినట్లు పీడీ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రకుమారి, ఏపీవో సురేష్ పాల్గొన్నారు.

కేజీబీవీలో అక్రమాలపై..

కొత్తూరు, జూలై24(ఆంధ్రజ్యోతి):వసప కేజీబీవీలో అక్రమాలపై వచ్చిన ఫిర్యాదులపై విచారణ అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని జిల్లా ఇన్‌చార్జి జీసీడీవో వి.ఉమా తెలిపారు.గురువారం వసప కేజీబీవీ పాఠశాలలో విచారణ నిర్వహించారు. ఇటీవల జరిగినమండల సమావేశంలో సభ్యులు కేజీబీవీ అధికారిఅక్రమాలు, భోజనాలు నాణ్యతగా లేవని, సహోపాధ్యాయులను చిన్నచూపు చూస్తున్నారని నిలదీయడంతో ఎంఈవోలు-1,2 గోవిందరావు, శ్రీనివాసరావులు షోకోజ్ నోటీసు జారీచేశారు.ఈ మేరకు డీఈవో, సమగ్ర శిక్ష ఏపీసీ విచారణకు ఆదేశించారు.విచారణ సమయంలో పాఠశాలప్రత్యేకాధికారి పల్లారాధిక అందుబాటులో లేరు. విద్యార్థులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు.జీసీడీవోతో పాటు సర్వశిక్ష అభియాన్ సహిత విద్య జిల్లా కోర్డినేటర్ బి.గోవిందరావు ఉన్నారు.

ఎరువుల కోసం రైతుల ఆందోళన

కోటబొమ్మాళి, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాసాహెబ్‌పేట రైతు సేవా కేంద్రం పరిధిలో అధికారులు కొంతమందికి ఎరువులు అందజేసి మిగిలిన వారికి ఇవ్వకపోవడంతో రైతులు గురువారం ఆందోళన చేశారు. అందరికి సమానంగా అందజేయాల్సిఉండగా నచ్చినవారికి మాత్రమే ఇచ్చి మిగిలిన వారికి స్టాక్ లేదని చెప్పడమేమిటని మసాహెబ్‌పేట పంచాయతీ పరిధిలో ని కమలనాభపురం, బోరుమజ్జిపాలెం గ్రామాల రైతులు వ్యవసాయ సహాయకులను నిలదీశారు. కాగా స్టాక్ ఉన్న మేరకు ముందు వచ్చిన రైతులకు ఇచ్చామని ఏవో ఎస్. గోవిందరావు తెలిపారు.రెండురోజుల్లో స్టాకు రాగానే అందరికి అందజేస్తామని, ప్రస్తుతం ఎరువుల కొరత లేదని చెప్పారు.

వీధుల్లో పరిశీలించి.. పథకాల తీరును ఆరా తీసి

● కొత్తూరులో జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ బృందం పర్యటన

కొత్తూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): పంచాయతీ, మండల పరిషత్ పరిధిలో రికార్డుల నిర్వహణ, అధికారుల పనితీరును జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ కేంద్రబృందం సభ్యులు జమీదాబ్ సాబ్, ఎస్ఎస్ రాథోడ్ పరిశీలించారు. గురువారం కొత్తూరు పంచాయతీ కార్యాలయం వద్ద అధికారులు, ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు, ప్రజలు వాటి వినియోగం,అధికారులు పర్యవేక్షణ సభ్యులు ఆరాతీశారు. అనంతరం కొత్తూరులోని పలు వీధుల్లో పర్యటించి పరిశీలించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సుధాకరావు, ఏపీడీలు పంచాది రాధిక, హారతి, ఎంపీడీవో వి.నీరజ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు తులసీవరప్రసాదరావు పాల్గొన్నారు.

వంశధార కాలువ కింద జోరుగా వరి నాట్లు

కోటబొమ్మాళి, జూలై 24 (ఆంధ్రజ్యోతి):మండలంలో అల్పపీడనం వల్ల రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండడం, వంశధార ఎడమ కాలువ ద్వారా నీరందడంతో రైతులుజోరుగా వరినాట్లు వేస్తున్నారు. ఊడికలపాడు, కోటబొమ్మాళి, హరిశ్చంద్రపురం, జర్జంగి, సౌడాం తదితర గ్రామాల్లో ఇప్పటికే 40 శాతం వరకు వరిలో ఎదసాగు చేస్తున్నారు. మిగిలిన 30 శాతం పంటపొలాల్లో రైతులు వరినాట్లు వేస్తున్నారు. కురుడు,దంత, పాకివలస, నారాయణవలస, తిలారు, కొత్తపేట, కిష్టపురం, శ్రీపురం తదితర గ్రామాలకు చెందిన రైతులు ఎత్తిపోతల పథకాల ద్వారా వస్తున్న నీటితో సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు.మూడేళ్లుగా వర్షాభావ పరిస్థితులు నెలకొనడం,ఎత్తిపోతల పథకాలుపాడవడంతో వరిసాగుకు నీరులేక రైతులు ఇబ్బందిపడ్డారు.అయితే ఈఏడాది వంశధార కాలువ ద్వారా సమయానికి నీరు రావడం, మెట్ట ప్రాంతాలకు ఎత్తిపోతల పథకాల ద్వారా నీరందించటంతో రైతులు వరి సాగుకు సిద్ధమయ్యారు. ఈ ఏడాది సుమారు ఎనిమిది వేల హెక్టార్లలో రైతులు వరి సాగు చేస్తున్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

సంఘ అభివృద్ధికి చేయూత అందించాలి

వజ్రపుకొత్తూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి):సంఘంఅభివృద్ధికి ప్రతిఒక్కరూ చేయూత అందించాలని కంచికామాక్షి విశ్వబ్రాహ్మణ సంఘం పలాస నియోజకవర్గ ప్రధానకార్యదర్శి లక్కోజు ధర్మారావు కోరారు. గురువారం వజ్రపుకొత్తూరులో కంచి కామాక్షి విశ్వబ్రాహ్మణ సంఘంసమావేశం నిర్వహించారు.సమావేశంలో నాయకు లు విశ్వేశ్వరరావు, కంచుమోజు కేశవరావు, కొత్తూర్తి జగ్గారావు, బూరగాపు చిం తామణి, వరవల్లి అర్జునరావు పాల్గొన్నారు.

మొరాయిస్తున్న ఆర్టీసీ బస్సులు


పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో మొరాయించిన బస్సును తోస్తున్న ప్రయాణికులు

కాశీబుగ్గ, జూలై 24 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో పలు డిపోల పరిధిలో ఆర్టీసీకాలం చెల్లిన బస్సులు నిర్వహిస్తుండడంతో తరచూ మొరాయిస్తున్నాయి.దీంతో తరచూ ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఐదేళ్ల వైసీపీ హయాంలో ఆర్టీసీపై చూపడంతో కొత్తబస్సుల కొనుగోలుచేయలేదు.ఉన్నవాటికి మరమ్మతులు చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ బస్సులపై దృష్టిపెట్టింది. అయితే డిపోల్లో ఎక్కువశాతం కాలం చెల్లిన బస్సులే ఉండడంతో సకాలంలో ప్రయాణికులు గమ్యస్థానాలను కూడా చేరుకోలేకపోతున్నారు. తాజాగా పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో శ్రీకాకుళం-1 డిపోకు చెందిన బస్సు ఇలా మొరాయించడంతో ప్రయాణికులు దిగి నెట్టాల్సివచ్చింది. తక్షణమే కాలం చెల్లిన బస్సుల స్థానంలో కొత్తవి అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వజ్రపుకొత్తూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కుపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల దృష్ట్యా అక్కుపల్లి, రాజాం, బాతుపురం, మోటూరు పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరాను శుక్రవారం నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ యజ్ఞేశ్వరరావు తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

●కోటబొమ్మాళి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో గల సరియాపల్లి, కొత్తపల్లి, దంత, కురుడు, రామేశ్వరం పంచాయతీల పరిధిలో గ్రామాలకు శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని టెక్కలి ట్రాన్స్‌కో ఈఈ నరసింహకుమార్ తెలిపారు. ఆర్‌డీడీఎస్ పనులు చేపడుతుండడంతో సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన

టెక్కలి, జూలై 24(ఆంధ్రజ్యోతి): శక్తి యాప్ పనితీరుపై ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఎస్ఐ రాజేష్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి సెల్‌ఫోన్‌లో శక్తి యాప్ ఉండాలని సూచించారు.

అచ్యుతానందన్‌కు నివాళి

కాశీబుగ్గ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు, కేరళ మాజీ ముఖ్యమంత్రి వీఎస్ అచ్యుతానందన్‌కు ఘన నివాళులర్పించారు. గురువారం కాశీబుగ్గలోని సీపీఎం కార్యాలయంలో సంతాపసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆయన మృతి సీపీఎంకు తీరని లోటు అని తెలిపారు. కార్యక్రమంలో ప్రసాద్, రాజు, లోకనాధం, రాజారావు, ఢిల్లేశ్వరి, భాగ్యలక్ష్మి, భాస్కరరావు పాల్గొన్నారు.

మందస, జూలై24(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ కార్యాలయంలో వీఎస్ అచ్యుతానందన్ సంతాప సభ నిర్వహించారు.కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, నాయకులు ఆర్. దిలీప్‌కుమార్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

గుర్రం జాషువాకు..

టెక్కలి, జూలై 24(ఆంధ్రజ్యోతి): టెక్కలి ఎస్సీ బాలుర మేనేజ్‌మెంట్ వసతిగృహంలో గురువారం సమతా సైనిక్‌దళ్ ఆధ్వర్యంలో కవి గుర్రంజాషువా జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో సమతా సైనిక్‌దళ్ జిల్లా అధ్యక్షులు చల్లా రామారావు, పేర నాగేష్ పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

టెక్కలి రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని తలగాం, నౌపడ ఆర్ఎస్ జడ్పీ పాఠశాలల విద్యార్థులకు గురువారం బిగ్‌హెల్ప్ సంస్థ ఆధ్వర్యంలో పుస్తకాలు అందజేసినట్లు హెచ్ఎం అమ్మన్నమ్మ తెలిపారు. కార్యక్రమం విద్యావతి, లలిత, లక్ష్మణరావు, శ్రీనివాసరావు, నరసింహరావు పాల్గొన్నారు.

ఏఈ బదిలీ

మందస,జూలై24(ఆంధ్రజ్యోతి):మంద ట్రాన్స్‌కో ఏఈగా పని చేస్తున్న ఎస్. యోగేశ్వరరావును పాలకొండకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో ప్రస్తుతం ఎవరినీ నియమించలేదు.

నాణ్యమైన భోజనం పెట్టాలి

కాశీబుగ్గ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): అన్న క్యాంటీన్‌లో నాణ్యమైన భోజనం పెట్టాలని కమిషనర్ ఎస్.రామారావు కోరారు. గురువారం కాశీబుగ్గ బస్టాండ్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ ద్వారా ఇస్తున్న టోకెన్లను తనిఖీచేశారు.

మొండ్రాయివలసలో యజ్ఞం

నందిగాం, జూలై 24(ఆంధ్రజ్యోతి): మొండ్రాయివలసలో బుధవారం రాత్రి అలేఖ్య యజ్ఞం నిర్వహించారు. గ్రామస్థులు, పలువురు అలేఖ్య స్వాములు విశేష పూజలు జరిపి వేదమంత్రాలు మధ్య నిర్విఘ్నంగా యజ్ఞం జరిపారు.